క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలిఅర్బన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, పలువురు వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందిపై వేటు

నిందితులకు సహకరించినందుకు సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌పై చర్యలు?

తెనాలిరూరల్: దేశ వ్యాప్తంగా మహిళలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక దాడులపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న వేళ మహిళ ఫోటోలను మార్ఫింగ్ చేసి నగ్న ఫోటోలుగా మార్చి ఆమెకే పంపి బెదిరించిన కేసులో నిందితులకు శిక్షపడకుండా ఉండేలా చేయడం ఆ సీఐ చేసిన నేరం. ఫలితంగా ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవ్వాల్సి వచ్చింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఎ. సుధాకర్ 2004లో పోలీసు శాఖలో ఉద్యోగం సాధించారు. సీఐడీ విభాగంలో పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈ ఏడాది జనవరి 27న తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. పట్టణానికి చెందిన ఓ మహిళ తన ఫోటోలను మార్ఫింగ్ చేసి కొరియర్‌లో పంపి బెదిరిస్తున్నారని పోలీసులకు ఆగస్టు నెలలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై స్థానిక పోలీసులు గుంటూరు సమీపంలోని గోరంట్ల, ప్రకాశం జిల్లా మార్కాపురం, కంభంకు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించారు. గోరంట్లకు చెందిన హార్డ్‌వేర్ ఇంజినీర్ అయిన యువకుడిని అదేనెల 24న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు, మిగిలిన ఇద్దరినీ స్వస్థలాలకు పంపించేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఇరిద్దరిపై కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చే సెక్షన్‌లు పెట్టి పంపించేందుకు బేరసారాలు జరిగాయి. ఇందులో ప్రకాశం జిల్లాకే చెందిన మరో సీఐ (ప్రస్తుతం) ఉమ్మడి గుంటూరులో పనిచేస్తున్న వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. ప్రకాశం జిల్లా యువకులను ఇళ్లకు పంపించినందుకు 25వ తేదీన టూ టౌన్ సీఐకు కొంత నగదు ముట్టజెప్పినట్టు తెలిసింది. దీనిపై 'సాక్షి' ఆగస్టు 26వ తేదీన సంచలన కథనం ప్రచురించింది. ఉలిక్కిపడిన ఉన్నతాధికారులు అత్యంత గోప్యంగా విచారణ జరిపి సీఐను సస్పెండ్ చేశారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ ఎమ్మెల్యే వత్తిడి, తన సొంత జిల్లా వ్యక్తే అయిన మరో సీఐ మాటలు విని కీలకమైన కేసులో నిందితులకు శిక్ష పడకుండా ఉండేలా చేసినందుకు సీఐ సుధాకర్ శిక్షకు గురయ్యాడని గుసగుసలు వినిపిస్తున్నాయి.

హెడ్‌కానిస్టేబుల్ పైనా..!

మహిళ ఫోటోలు మార్ఫింగ్ చేసిన కేసులో నిందితులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో సీఐతో పాటు మరో హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురైనట్టు తెలిసింది.ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు, తెనాలి డీఎస్పీని అత్యంత గోప్యంగా విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. డీఎస్పీ సెలవులో ఉన్న రోజుల్లో ఆయనకు మార్ఫింగ్ కేసు గురించిన సమాచారం ఇవ్వకుండానే నిందితులను తప్పించారని విచారణలో తేలింది. ఇదే విషయాన్ని డీఎస్పీ ఉన్నతాధికారులకు నివేదిక పంపడంతో చర్యలు తీసుకున్నట్టు సమాచారం.

మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు బదిలీ

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ మేనేజర్ అప్పలరాజును భీమవరపు మున్సిపల్ కార్పొరేషన్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో భీమవరంలో మేనేజర్‌గా పనిచేస్తున్న చండీ దేవసేన తెనాలి రానున్నారు. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న ఎ.రామచంద్రరావును రేపల్లెకు, డి.శ్రీనివాసరావును బాపట్లకు బదిలీ చేశారు. వీరి స్థానంలో బాపట్లలో పనిచేస్తున్న సయ్యద్ నజీర్, పొన్నూరులో పనిచేస్తున్న వీబీఎస్ఎన్ ప్రసాద్, చిలకలూరుపేటలో పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావును తెనాలి మున్సిపాలిటీ బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న వరద ఉధృతి

- కృష్ణానదిలో వరద డేంజర్ బెల్స్
- కరకట్ట అంచులవరకు వరదనీరు
- ఇసుక, మట్టి, గ్రావెల్‌తో తాత్కాలిక అడ్డుకట్ట
- నీటిలో ఉద్యాన పంటలు



కొల్లిపర మండలంలో కృష్ణా నది కరకట్ట దిగువున పూర్తిగా వరదలో మునిగిన పసుపు, కంద, కేవలం అరటి చెట్టు చివరి భాగం మాత్రమే కనిపిస్తున్న దృశ్యం

కొల్లిపర: కృష్ణానదిలో వరద డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు సోమవారం 11.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కొల్లిపర మండల పరిధిలో కృష్ణానది కరకట్ట అంచులవరకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల గ్రామాలైన అత్తలూరి పాలెం, పిడపర్రు గ్రామాల వద్ద ఇప్పటికే బలహీనంగా ఉన్న కరకట్ట కోతకు గురయ్యే ప్రమాదం నెలకొంది. వరద నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదాన్ని శంకించిన అధికారులు వెంటనే అక్కడ ఇసుక, మట్టి, గ్రావెల్‌ను తరలించి, గోతాల్లో నింపి కరకట్టకు తాత్కాలికంగా అడ్డుగా వేశారు.

వరద ఉధృతి పెరగడంతో అన్నవరపు లంక, పాత బొమ్మువానిపాలెం, కొత్తూరు లంక గ్రామంలో పల్లపు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. దీంతో ప్రజలకు వరద ఉధృతి గురించి అధికారులు వివరించి గ్రామంలో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లంక గ్రామాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సేవల్లో నిమగ్నమయ్యారు.



పిడపర్రు వద్ద కరకట్ట బలహీనంగా ఉండటంతో ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

వరద నీటిలో ఉద్యాన పంటలు

కృష్ణానది కరకట్ట అంచువరకు వరదనీరు ప్రవహిస్తుండటంతో కరకట్ట దిగువున గల 1424 ఎకరాల్లోని ఉద్యాన పంటలు పసుపు, అరటి, కూరగాయలు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. కొన్నిచోట్ల అరటి తోటల చివరిభాగం మాత్రమే కనిపిస్తున్నాయి. పంటలు పూర్తిగా వరదలో ఉన్నందున చేతికొచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున అందరిలోనూ ఉత్కంఠ నెలకొని ఉంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వరద ఉధృతి తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లంక ప్రజలకు అందుబాటులో ఉంటూ, పునరావాసం కేంద్రంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. లంక గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు పునరావాస కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ఎలాంటి సమస్యలున్నా, వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ రెండు రోజులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వీరితో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, ఈవోపిఆర్డీ పూర్ణ శంకర రావు, ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.



కృష్ణానది కరకట్ట వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



కొల్లిపర మండలంలో కృష్ణా నది కరకట్ట దిగువున పూర్తిగా వరదలో మునిగిన అరటి



అన్నవరపు లంక గ్రామంలో పాఠశాలలోకి చేరిన వరద నీరు



బొమ్మువానిపాలెంలో మొక్కజొన్న బస్తాలను పడవపై ఒడ్డుకు చేరవేస్తున్న దృశ్యం

రాజన్నపాలనలో విప్లవాత్మక సంస్కరణలు



తెనాలి మండలం హాఫ్‌పేటలో వైఎస్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శివకుమార్, పార్టీ శ్రేణులు



కొల్లిపర గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తు నేతలు



తెనాలి మండలం కొలకలూరులో అన్నదానం ఏర్పాటు చేసిన స్థానిక నాయకులు

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- వాడవాడలా మహానేతకు ఘననివాళి

తెనాలి: పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించాలన్న భావనతో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తన పాలనలో విప్లవాత్మక సంస్కరణలను అమలుచేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. డాక్టర్ వైఎస్ 15వ వర్ధంతి రోజైన సోమవారం స్థానిక రణరంగ చౌక్ లోని ఆయన కాంస్య విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి శివకుమార్ పుష్పాంజలి ఘటించారు. అక్కడే పార్టీ నేతలు, కార్యకర్తల నుద్దేశించి ప్రసంగించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, ఆవుల కోటయ్య, పెదలంక లక్ష్మీ లావణ్య, కొర్ర యశోద, షేక్ దుబాయ్‌బాబు, షేక్ మొగల్ అహ్మద్, యాతాటి అనిల్, బచ్చనబోయిన శ్రీనివాస్, బూరెల దుర్గాప్రసాద్, తాడిబోయిన రమేష్, మన్నవ ప్రభాకర్, కఠారి హరీష్, కాకి దేవసహాయం, యలవర్తి సాంబశివరావు, పెదలంక వెంకటేశ్వర్లు, ఆరాధ్యుల కన్నా, చుండూరు సాయి, టెక్స్ బాల, గుంటూరు కృష్ణ, కుర్రా శ్రీను, అక్కిదాసు కిరణ్‌కుమార్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో...

రూరల్ మండలం కొలకలూరులో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ నాయకులతో కలిసి డాక్టర్ వైఎస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పేదలకు అన్నదానం చేశారు. పార్టీ నాయకులు కోడూరు రమేష్, ఫణికుమార్, ప్రసాదం బాల గురవమ్మ, సుద్దపల్లి నవీన్, పినపాటి అనిల్ కుమార్, కొలంటి దాసు, అమీర్ భాషా, నాగూర్, ప్రసాదం రాధారావు, వంశీ, భూషయ్య, బుల్లియ్య, దానియేలు, ఎస్‌కె జానీ, మోషే, గోవర్ధన్, కోటేశ్వరరావు, వీరారెడ్డి, లక్ష్మయ్య గారు పాపారావు, బాబీ, కిరణ్, భరత్, సుధా తదితరులు పాల్గొన్నారు.



తూములూరులో రాజన్నకు నివాళులర్పిస్తున్న దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణారెడ్డి

హాఫ్‌పేటలో...

హాఫ్‌పేటలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ముందుగా అక్కడి డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్వర్గీయ వైయస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ గోవతోటి సుధాకర్, ఎంపీటీసీ ఇసుకపల్లి సుందరరావు, సర్పంచ్ ఎర్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు కంరర్ల అబ్రహాం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పిల్లి అనిల్ కుమార్, అమృతలూరు ఏసుపాదం, సాధు వెంకటేశ్వరరావు, సుందరరావు, పిల్లి నాని, అశోక్ పాల్గొన్నారు.

కొండవీటి సేవాసమితి...

కొండవీటి సేవా సమితి ఆధ్వర్యంలోమహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రణరంగచౌక్ సమీపంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సేవాసమితి గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కొండవీటి సేవాసమితి కార్యదర్శి మెట్టు శ్రీనివాసరెడ్డి, కోశాధికారి కామిరెడ్డి చెన్నారెడ్డి, సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉడుముల చిన్నబాలకోటిరెడ్డి, సానికొమ్ము ప్రసాద్‌రెడ్డి, మొద్దుకుప్పం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మదిలో రాజన్న

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరపు శివకోటిరెడ్డి, వంగా భూషిరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక పాల్గొన్నారు. తూములూరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహాని దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఈమని హరికోటిరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి,ఎంపీటీసీ మర్రెడ్డి మాధవి, ఈద హర్షవర్ధన్ రెడ్డి,కొల్లి రాఘవరెడ్డి, బేతాల భూషణం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొవెరపు దేవానంద్ స్థానిక రణరంగచౌక్ దగ్గర్లోని వైఎస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ జేఏసీ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ గొరిగపూడి బాలరాజు, అంబేడ్కర్‌లు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వైఎస్ ప్రవేశపెట్టిన జనరంజక సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ చేసిన మేలుపై మీడియాతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర వైస్‌చైర్మన్ గుర్రం ద్వారకా శ్రీను సోమవారం స్థానిక రణరంగ చౌక్‌లోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జలయజ్ఞం ప్రాజెక్టులతో రైతులకు కలిగిన ప్రయోజనాలను గుర్తు చేసుకున్నారు.

చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నాం..!

మంత్రి ఎదుట కన్నీటి పర్యంతమైన గురుకుల పాఠశాల ఉపాధ్యాయినులు



తెనాలిరూరల్: చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడమే కష్టంగా ఉందని చావలేక బతుకీడుస్తున్నామని తెనాలి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ముంపుకు గురైన పాఠశాలను పరిశీలించేందుకు వచ్చిన మంత్రితో పాఠశాల ఉపాధ్యాయినులు మాట్లాడారు. ఉదయం ఏడు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు విధులు నిర్వహిస్తున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయించుకుని కేవలం రూ.12,900 మాత్రమే వేతనంగా ఇస్తున్నారని వాపోయారు. పదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని, తమ పోస్టులనూ మెగా డీఎస్సీలో కలపడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రిని వేడుకున్నారు. ఉపాధ్యాయుల ఆవేదన విన్న మంత్రి సీఎంతో మాట్లాడి వేతనాలు పెంచేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. డీఎస్సీ రాయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ ప్రాంతానికి చెందిన శశాంక్ అతని మిత్రులు స్లారా, అక్షిత్, నవీన్ మరి కొంత మంది ఐతానగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో ఖాళీ స్థలంలో సోమవారం మద్యం సేవించారు. శశాంక్‌పై మిగిలిన వారు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మిస్తాం

మంత్రి సంధ్యారాణి

తెనాలిరూరల్: ఇటీవల ముంపునకు గురైన గురుకుల పాఠశాలకు త్వరలో నూతన భవనాన్ని నిర్మిస్తామని, భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెనాలి తహసీల్దార్‌ను ఆదేశించారు. రోడ్డు కన్నా పాఠశాల పల్లంగా ఉండడంతో ముంపునకు గురైందని, పాఠశాలను శుభ్రపరచి అన్ని సదుపాయాలు కల్పించి విద్యార్థులను తిరిగి పాఠశాలకు తరలిస్తామని చెప్పారు. తెనాలి పట్టణంలోని మారీసుపేట ఆర్ఆర్ నగర్‌లోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మంత్రి సంధ్యారాణి సోమవారం ఉదయం పరిశీలించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి పాఠశాల ఆవరణ, ప్రిన్సిపల్ గది, స్టాఫ్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, వార్డు కౌన్సిలర్ తోక శిరీష, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.



తరగతి గదులను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి, మాజీ మంత్రి ఆలపాటి

చేలో నీటిని బయటకు పంపాలి

లాంఫారం శాస్త్రవేత్త డాక్టర్ గోపాలస్వామి



తెనాలి-గుంటూరు రోడ్డులో పంటపొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

తెనాలి: భారీ వర్షాల కారణంగా పంటపొలాల్లో నిలిచిన నీటిని రైతులు సాధ్యమైనంత త్వరగా బయటకు పంపేందుకు తగిన మార్గాలను వెతకాలనీ, నీరు పోయాక యూరియా లేదా డీఏపీ/ కేఎన్‌ఓ3నుగాని చేల్లో చల్లాలని లాం ఫారం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి సూచించారు. వ్యవసాయ అధికారులతో కలిసి డాక్టర్ గోపాలస్వామి, లాం ఫారంకు చెందిన మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి సోమవారం రూరల్ మండలంలోని హాఫ్‌పేట, పెదరావూరు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో పర్యటించారు.

నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వరదనీటిని బయటకు పంపాక, ఎరువులు చల్లటంతోపాటు తెగుళ్లు రాకుండా కార్బెండజిమ్ అనే మందును పిచికారి చేయాలని సలహానిచ్చారు. తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉంటూ పంట చేలల్లోని నీటిని తొలగించుకోవాలని సూచించారు. తెనాలి మండలంలో పరిపైరు 5 వేల ఎకరాల్లో నీట మునిగినట్టు ప్రాథమిక అంచనాగా మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ వెల్లడించారు. జలవనరులశాఖ అధికారులను సంప్రదించి, హాఫ్‌పేట దగ్గర డ్రెయినులో వచ్చే తూటికాడ, వ్యర్థ పదార్థాలను తొలగించినట్టు తెలిపారు. సంగంజాగర్లమూడి వద్ద తొలగిస్తున్నట్టు తెలిపారు. వీరితో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏఈవో మోహన్, వీఏఏలు వంశీ, ప్రజ్ఞాన్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే..

వరద సహాయక చర్యల్లోకి తెనాలి సబ్‌కలెక్టర్



తెనాలి: తెనాలి సబ్‌కలెక్టర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారిణి వి.సంజనా సింహా ఆదివారం రాత్రి స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సంజనా సింహా నెల్లూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ అనంతరం, విద్యుత్ మంత్రిత్వశాఖలో కార్యదర్శిగా చేశారు. అక్కడి నుంచి తెనాలి సబ్‌కలెక్టర్‌గా ఇటీవలే ఆమెను ప్రభుత్వం నియమించింది. కృష్ణానదికి వరద ఉధృతి పెరగటంతో సహాయక చర్యల నిమిత్తం, బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే సోమవారం తెల్లవారుజామున సంజనా సింహా కొల్లిపర మండలానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.